అప్పు ముంపులో అన్నదాత

నాలుగు డబ్బులు సంపాదించి.. బతుకు కష్టాల నుంచి గట్టెక్కుదామనుకున్న అన్నదాతలపై ప్రకృతి కన్నెర్రజేస్తోంది. ఆరుగాలం శ్రమించి.. పండిస్తున్న పంటలను వర్షాలు, వరదల రూపంలో కబళిస్తున్నాయి. దీంతో పెట్టుబడులూ చేతికందక రైతులు ఆర్థికంగా చితికిపోతున్నారు. కొందరికి పంట నష్టపరిహారం అందుతుందనే చిన్న ఆశ ఉన్నా.. సి–క్లాస్ లంక రైతులకు అది కూడా అందని ద్రాక్షగానే మిగులుతోంది. దీంతో వారు అప్పుల ఊబిలోకి కూరుకుపోతున్నారు.

- వరదలకు పంటలు కోల్పోయిన కర్షకులు
- తీవ్రంగా నష్టపోయిన వైనం
- ఆదుకోవాలంటున్న సి–క్లాస్ లంక రైతులు


కాకరపర్రులో నీట మునిగిన బంతి తోట


మల్లేశ్వరం వద్ద ముంపులో ఉన్న పంటలు

పెరవలి: గోదావరి వరద తగ్గుముఖం పట్టింది. ఇప్పటికీ పంటలు నీటిలోనే ఉండడంతో లంక రైతులు గగ్గోలు పెడుతున్నారు. సి–క్లాస్ లంక రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది. ఏళ్ల తరబడి ఈ లంక భూముల్లోనే సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఏటా గోదావరికి వచ్చే వరదల వల్ల పంటలు దెబ్బతిన్నా, వారికి ఎలాంటి పంట బీమా సాయం అందదు. దాంతో పంట మునిగినప్పుడల్లా సి–క్లాస్ లంక రైతులు అప్పుల్లో మునిగిపోతున్నారు.

ఇదీ పరిస్థితి

గతంలో గోదావరికి వరద వచ్చినప్పుడు పంటలు కోల్పోయిన సి–క్లాస్ లంక రైతులు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో నష్ట పరిహారం పొందారు. ముందెన్నడూ ఇలా లంక రైతులకు నష్ట పరిహారం లభించలేదని రైతులు అంటున్నారు. తర్వాత వచ్చిన పాలకులు, అంతకుముందు ప్రభుత్వాలు లంక రైతుల గోడు వినేవారే లేరన్నారు. కనీసం సి–క్లాస్ లంక భూములకు లీజు పట్టాలు కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడ్డాక సి–క్లాస్ లంక రైతులకు గతంలో మాదిరిగా ఏడాది కాకుండా, ఐదేళ్లకు లీజు పట్టాలు మంజూరు చేశారు. ఇలా పెరవలి మండలంలో 998 మంది రైతులకు లంక భూములకు లీజ్ పట్టాలు మంజూరయ్యాయి. ఈ ఏడాది గోదావరికి వరదల వలన తీవ్రంగా నష్టపోయింది కూడా సి–క్లాస్ లంక రైతులేనని అంటున్నారు.

దస్తావేజులుంటేనే..

పెరవలి మండలంలో లంకల్లో రైతులు మూడు వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. ఇందులో రైతు వారీ భూములు 1,400 ఎకరాలుంటే, 1,600 ఎకరాలు సి–క్లాస్ భూములే, దీనివల్ల దస్తావేజులున్న పంట భూములకు మాత్రమే నష్ట పరిహారం అందుతుండగా, మిగిలిన సి–క్లాస్ భూములకు అందడం లేదు. సాగు సి–క్లాస్ రైతులదైతే, నష్ట పరిహారం మాత్రం లంక రైతులకు దక్కుతుందని, ఇద్దరూ చేసేది లంక పంటల సాగేనని, నష్టం ఇద్దరికీ కలుగుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఒకరికి ఇచ్చి, సి–క్లాస్ రైతులకు ఇవ్వకపోవటంతో వారు ఆర్థికంగా కుదేలవుతున్నారు.

40 ఏళ్లుగా..

గోదావరికి వరద వలన అన్ని పంటలు నీటి పాలవుతున్నప్పుడు, అందరికీ నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకుంటేనే న్యాయం జరిగినట్టవుతుందని రైతులు చెబుతున్నారు. సి–క్లాస్ పట్టాలు పొందిన రైతులు గత 40 ఏళ్లుగా ఈ భూములను సాగు చేస్తున్నా, నష్ట పరిహారం అందడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా సి–క్లాస్ లంక రైతులకు కూడా నష్ట పరిహారం అందించాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

అంతా మునిగిపోయింది



సి–క్లాస్ పట్టా భూమిలో పంట కోల్పోయిన రైతులకు మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి నష్ట పరిహారం ఇచ్చారు, ఆ తర్వాత ఎవరూ ఇవ్వలేదు. నేను ఎకరం అరటి పంట వేశాను. పది రోజుల్లో కోతకు వస్తుందనగా, గోదావరికి వరద రావటంతో అరటి తోట పూర్తిగా మునిగిపోయింది. దీంతో రూ.60 వేలు నష్టపోయాను.

– మెట్టి నాగరాజు, సి–క్లాస్ లంక, అరటి రైతు, లంకమాలపల్లి

రూ.లక్ష నష్టపోయా..



సి–క్లాస్ పట్టా పొందిన భూమిలో ఎకరం కంద పంట వేశాను, తవ్వకాల సమయంలో గోదావరికి వరద రావటంతో చేను పూర్తిగా నీట మునిగింది. దీంతో రూ.లక్ష నష్టం వచ్చింది, ప్రభుత్వం సి–క్లాస్ రైతులను ఆదుకోవాలని కోరుతున్నాను.

– రాయుడు లీలాబాబు, సి–క్లాస్ లంక, కంద రైతు, ఖండవల్లి

ఆర్థికంగా దెబ్బతిన్నాం



గోదావరి లంకలో అర ఎకరం కూరగాయల పంటలు వేశాను, వరదతో మొత్తం పోయింది, ప్రభుత్వం లంక రైతులను ఆదుకోవాలి లేకపోతే అప్పుల పాలై, ఆర్థికంగా నలిగిపోతాం,

– సరిపల్లి బుజ్జిబాబు, రైతు, లంకమాలపల్లి

క్లుప్తంగా

విద్యార్థులకు బస్ పాస్‌ల పంపిణీ


విద్యార్థులకు బస్ పాస్‌లు అందజేస్తున్న నిహారిక

నల్లజర్ల: వివిధ గ్రామాల నుంచి నల్లజర్ల హైస్కూలుకు వస్తున్న పేద విద్యార్థులకు బస్‌పాస్‌ల పంపిణీ కార్యక్రమం గురువారం జరిగింది, గ్రామానికి చెందిన డాల్ఫిన్ వాటర్ ప్లాంట్ తరఫున నిహారిక 200 మంది విద్యార్థులకు బస్ పాస్‌లు అందజేశారు. 2016 నుంచి ఇప్పటివరకు ఏటా డాల్ఫిన్ వారు పేద విద్యార్థుల బస్ పాస్‌లకు అయ్యే ఖర్చును భరిస్తున్నట్టు హెచ్‌ఎం కోమలి చిత్ర తెలిపారు. తాడేపల్లిగూడెం ఆర్టీసీ డిపో మేనేజర్ వైఎస్ఎన్ మూర్తి, పీఆర్వో దొంతల విజయ కుమార్, బస్ పాస్ ఇన్‌చార్జ్ టీచర్ సీహెచ్ మనోహరకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సభ్యత్వ నమోదు


సభ్యత్వ నమోదు చేస్తున్న సంఘ నాయకులు

ఉండ్రాజవరం: భవన నిర్మాణ కార్మికులంతా ఐక్యతతో సమస్యలు పరిష్కరించుకోవాలని సంఘ జిల్లా మాజీ అధ్యక్షుడు జగన్నాథం అన్నారు. మండలంలోని తాడిపర్రు, ఇతర గ్రామాలలో గురువారం సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమ బోర్డు రద్దు చేయడం వలన కార్మికులు అనేక విధాలుగా నష్టపోయారన్నారు. సంఘ అధ్యక్షుడు దేవరపల్లి వినాయకుడు, నాయకులు అరిగెల సూరి పండు, గారపాటి శ్రీను, తోట చక్రధరరావు, శ్రీరంగం శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

14న జాతీయ లోక్ అదాలత్


ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి.రామకృష్ణ

నిడదవోలు: మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఈ నెల 14న జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ జి.రామకృష్ణ గురువారం ఇక్కడ తెలిపారు. మీడియేషన్, మనోవర్తి, క్రిమినల్ కేసులు, సివిల్ తగాదాలు, పెట్టీ, బీఎస్ఎన్ఎల్, బ్యాంకుల కేసులు తదితర వాటికి రాజీకి యోగ్యమైన కేసులను పరిష్కరించుకోవచ్చని వివరించారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఇందుకు పోలీసు శాఖ సహకరించాలని, ఎక్కువ రాజీ యోగ్యమైన కేసులను పరిష్కరించేలా చూడాలని తెలిపారు.

లారీ బోల్తా పడి ఇద్దరికి గాయాలు


సంఘటన స్థలంలో బోల్తా పడి ఉన్న లారీ

గోపాలపురం: మండలంలోని కరిచర్లగూడెం, జగన్నాథపురం గ్రామాల మధ్య జాతీయ రహదారిపై లారీ బోల్తాపడి డ్రైవర్, క్లీనర్లు గాయాల పాలైన ఘటన గురువారం జరిగింది. రాజమహేంద్రవరం నుంచి హైదరాబాద్ వెళుతున్న లారీ.. జగన్నాథపురం వద్ద జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి రోడ్డు మార్జిన్‌లోకి దూసుకుపోయింది. దీంతో లారీ బోల్తా పడి, అందులో ఉన్న డ్రైవర్, క్లీనర్లకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స కోసం గోపాలపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఫొటో, వీడియోగ్రాఫర్ల సంఘ నూతన కార్యవర్గం

నిడదవోలు : నిడదవోలు ఏరియా ఫొటో అండ్ వీడియోగ్రాఫర్ల సంక్షేమ సంఘ ఎన్నికలను గురువారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు గెల్ల రాజాబాబు ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. సంఘ నూతన అధ్యక్షుడిగా డి.ముప్పవరం గ్రామానికి చెందిన మేడ పూర్ణచంద్రరావు, ఉపాధ్యక్షుడిగా ఆగడ్డ సిద్ధబాబు, కార్యదర్శిగా షేక్ సిరాజుద్దీన్, సహాయ కార్యదర్శిగా అడబాల నరేష్ పీఆర్వోగా ఉప్మాకుల శ్రీను ఎంపికయ్యారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

నల్లజర్ల/నిడదవోలు రూరల్/చాగల్లు: వివిధ విద్యుత్ సబ్‌స్టేషన్ల మరమ్మతుల కోసం శుక్రవారం గ్రామంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ నిడదవోలు ఆపరేషన్స్ ఈఈ బి.వీరభద్రరావు తెలిపారు. వ్యవసాయ పంపుసెట్లకు ఉదయం 4 నుంచి 9, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు సరఫరా ఉంటుంది. తాడిమళ్లలో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒకటి వరకు విద్యుత్ సరఫరా ఉండదు. కలవలపల్లి చిక్కాల అమ్మికుంట గ్రామాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు.

పారదర్శకంగా ఉచిత ఇసుక విధానం


అధికారులతో మాట్లాడుతున్న ముఖ్య కార్యదర్శి మీనా, కలెక్టర్ ప్రశాంతి

నిడదవోలు రూరల్: రాష్ట్రంలో పారదర్శకంగా ఉచిత ఇసుక విధానం అమలవుతోందని మైనింగ్, ఎక్సైజ్ శాఖ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా అన్నారు. నిడదవోలు మండలం పెండ్యాల గ్రామంలోని ఇసుక స్టాక్ పాయింట్‌ను ముఖేష్‌కుమార్ మీనా, కలెక్టర్ పి.ప్రశాంతి గురువారం ఆకస్మికంగా పరిశీలించారు. కలెక్టర్ల అధ్యక్షతన ఏర్పాటుచేసిన లోడింగ్, రవాణా కమిటీల పనితీరుపై ఆయన చర్చించారు. లారీ యజమానులు కచ్చితంగా ప్రభుత్వ ఆదేశాలు పాటించి, రవాణా చార్జీలు వసూలు చేయాలని సూచించారు. వీరి వెంట కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, ఇన్‌చార్జ్ తహసీల్దార్ శ్రీనివాస్, మైనింగ్, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

ఎస్ఎంసీ ఎన్నికల నోటిఫికేషన్ జారీ

ఉండ్రాజవరం: మండలంలో 32 ప్రాథమిక, 8 ఉన్నత పాఠశాలల యాజమాన్య కమిటీలకు గురువారం ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయినట్టు ఎంఈఓ సక్సేనారాజు గురువారం తెలిపారు. ఐదో తేదీన అభ్యంతరాలు స్వీకరించి, తుది జాబితాను ప్రకటిస్తామని, ఎనిమిదిన ఎన్నికలు నిర్వహిస్తామన్నారు.

కల్తీ కానివి తల్లి పాలు

తల్లిపాల వారోత్సవాల ప్రారంభ సభలో ఎమ్మెల్యే ముప్పిడి


గర్భిణులకు సీమంతాలు చేస్తున్న అతిథులు

కొవ్వూరు: నేడు మార్కెట్‌లో అన్నీ కల్తీమయం అవుతున్నాయని, ప్రపంచంలో కల్తీకి ఆస్కారం లేనివి, శ్రేష్ఠమైన తల్లిపాలు మాత్రమేనని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. తల్లి పాలను అందించడం ద్వారా పిల్లలు ఆరోగ్యవంతంగా ఉంటారని చెప్పారు. స్థానిక శ్రీనివాసపురంలోని టీవీఆర్ కల్యాణ మండపంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల ప్రారంభ సభలో ఆయన మాట్లాడారు. పోషకాహార లోపాలు, ఆహార అలవాట్ల కారణంగా ప్రస్తుతం సాధారణ కాన్పులు సాధ్యం కాని పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ప్రతి గర్భిణీ సమతుల్యమైన పోషకాహారం తీసుకుంటే, ఆరోగ్యవంతులైన బిడ్డలు పుడతారన్నారు. ఐసీడీఎస్ సీడీపీవో డి.మమ్మి మాట్లాడుతూ ఆగస్టు తొలి వారంలో తల్లిపాల ప్రాముఖ్యాన్ని చాటేందుకు వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. పలువురు గర్భిణులకు ఎమ్మెల్యే, ఇతర అతిథుల చేతుల మీదుగా సీమంతాలు నిర్వహించారు. అమెరికన్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో హార్లిక్స్ కంపెనీ సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది. మున్సిపల్ చైర్మన్ బావన రత్నకుమారి, ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, ఎంపీపీ కాకర్ల నారాయుడు, అర్బన్ బ్యాంక్ చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ముర్రు పాలతోనే శిశువుకు ఆరోగ్యం

ఉండ్రాజవరం: పుట్టిన బిడ్డకు ముర్రు పాలు పట్టించడం ఎంతో ఆరోగ్యదాయకమని స్థానిక పీహెచ్‌సీ వైద్యులు రాజనాల ప్రసాద్ అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా పాలంగి బీసీ కాలనీ, ఉండ్రాజవరంలోని అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముర్రుపాలలో వ్యాధి నిరోధక శక్తి ఉంటుందని, బిడ్డ పుట్టిన నాటి నుంచి ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఎం.సుబ్రహ్మణ్యం, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు మేలు: సీడీపీఓ

పెరవలి: రోగ నిరోధక శక్తి అధికంగా ఉన్న తల్లిపాలతో బిడ్డ ఆరోగ్యవంతంగా పెరుగుతాడని ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీలక్ష్మి అన్నారు. తీపర్రులో గురువారం తల్లిపాల వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలికలు, తల్లులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. లేనిపోని అపోహలతో కొందరు బిడ్డలకు పాలివ్వటం లేదని, దీంతో అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, వర్కర్లు పాల్గొన్నారు.

నిలకడగానే గోదావరి వరద

కొవ్వూరు: గోదావరి నదిలో వరద ఉధృతి రెండు రోజుల నుంచి నిలకడగానే కొనసాగుతోంది. పట్టణంలో గోష్పాద క్షేత్రంలోని స్నాన ఘట్టాలను ముంచెత్తి వరద ప్రవహిస్తోంది. ధవళేశ్వరం ఆనకట్ట వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక ఇంకా కొనసాగుతోంది. క్షేత్రానికి వెళ్లే రహదారులు బురదమయంగా మారాయి. గోదావరి లంకల్లో నీట మునిగిన పొలాలు తేరుకున్నాయి. శుక్రవారం సాయంత్రానికి వరద సాధారణ స్థితికి చేరవచ్చని అధికారులు చెప్పారు. ఎగువ ప్రాంతంలోను వరద తీవ్రత నెమ్మదిస్తోంది. ధవళేశ్వరం ఆనకట్ట వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక గురువారం అర్ధరాత్రికి ఉపసంహరించే అవకాశం ఉందని భావిస్తున్నారు.

పశువుల దాణా పంపిణీ

గోదావరి వరదల నేపథ్యంలో సీతంపేట, మద్దూరుల్లోని పాడి పశువుల కోసం సమీకృత దాణాను ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు రైతులకు అందజేశారు. ఐదు టన్నుల దాణాను రైతులకు ఉచితంగా అందజేసినట్టు పశు సంవర్ధక శాఖ ఏడీ ఎ.వెంకటరెడ్డి తెలిపారు. ఎంపీపీ కాకర్ల నారాయుడు, సర్పంచ్‌లు ఉప్పులూరి ముని రాజేంద్రప్రసాద్(బాబ్జీ), బొలిశెట్టి రత్నకుమారి, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, ఎంపీడీఓ కె.సుశీల, పశు వైద్యాధికారి కేఎస్‌వీ చంద్రమౌళి పాల్గొన్నారు.


గోష్పాద క్షేత్రంలో స్నాన ఘట్టం వద్ద వరద

వంతెనపై నిలిచిన వర్షపు నీరు

దేవరపల్లి: పోలవరం కుడి కాలువపై దేవరపల్లి వద్ద నిర్మించిన వంతెనపై గత 10 రోజులుగా మోకాలు లోతు నీరు నిలిచి ఉంది. బురద మట్టి చేరడంతో ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. వంతెనకు ఇరువైపులా నీరు పోయే మార్గాలు పూడుకుపోవడం వల్ల ఈ దుస్థితి ఎదురైంది.

అట్టహాసంగా చైర్మన్ భూపతి జన్మదిన వేడుకలు


చైర్మన్ ఆదినారాయణకు శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు, కౌన్సిలర్లు

నిడదవోలు: మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ 70వ జన్మదిన వేడుకలు స్థానిక మున్సిపల్ కార్యాలయం, రోటరీ క్లబ్ ఆడిటోరియంలో గురువారం అట్టహాసంగా నిర్వహించారు. చైర్మన్ ఆదినారాయణకు మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన భారీ కేక్‌ను కట్ చేశారు. మున్సిపల్ ఉద్యోగులు, కౌన్సిలర్లు, వివిధ గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు చైర్మన్ ఆదినారాయణకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రముఖులు కామిశెట్టి సత్యనారాయణ, పువ్వల రతీదేవి, షేక్ వజీరుద్దీన్, గాజుల రంగారావు, గోపిరెడ్డి శ్రీనివాస్, కొత్తపల్లి సుప్రియ, కారింకి నాగేశ్వరరావు, సుంకవల్లి శ్రీహరి, గజ్జరపు రమేష్, ఆలమూరి రాజశేఖర్, మొదలవలస నాని, మున్సిపల్ కమిషనర్ రాంభూపాల్ రెడ్డి, ఏఈ హేమంత్, ఎంపీపీ తిరుమల భాగ్యలక్ష్మి, మాజీ ఏఎంసీ చైర్మన్ వెలగన పొలయ్య, జెడ్పీటీసీ కొయ్యె సూరిబాబు, మున్సిపల్, పోలీస్, రెవెన్యూ, విద్యుత్, అంగన్‌వాడీ, ఆర్అండ్‌బీ, మెప్మా అధికారులు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సామాజిక భద్రత కోసమే పింఛన్లు


పురుషోత్తపల్లిలో దివ్యాంగురాలికి పింఛను అందజేస్తున్న మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు రూరల్: పేదల సామాజిక భద్రత కోసం పింఛన్లు పంపిణీ చేస్తున్నట్టు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. పురుషోత్తపల్లి గ్రామంలో గురువారం ఆయన పెన్షన్‌దారుల ఇంటికి వెళ్లి పింఛనును అందజేశారు. మండల ప్రత్యేకాధికారి దుర్గేష్, ఎంపీటీసీ కర్రి సుజాత, ఎంపీడీఓ జేఏ ఝాన్సీ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కానురులో..

పెరవలి: తాము ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకుని పింఛన్లు అందిస్తున్నామని మంత్రి దుర్గేష్ తెలిపారు. కానూరులో ఆయన పింఛను పంపిణీని ప్రారంభించారు. మండలంలో ఉన్న 10,092 పింఛన్లను ఒక్కరోజే పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. సర్పంచ్ బావన మధు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

కొవ్వూరు: పట్టణంలో పింఛన్ల పంపిణీని కలెక్టర్ పి.ప్రశాంతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక బాపూజీ నగర్‌లో పంపిణీ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ పట్టణంలో 3,991 మందికి రూ.1.73 కోట్లు అందించనున్నట్టు చెప్పారు. మున్సిపల్ కమిషనర్ కె.డానియేలు జోసఫ్ పాల్గొన్నారు. ఇందిరమ్మ కాలనీలో పింఛన్ల పంపిణీని డీఆర్వో నరసింహులు పరిశీలించారు. బ్రిడ్జిపేటలో, మూడో వార్డుతో పాటు, సీతంపేట, మద్దూరులంక గ్రామాల్లో పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, ద్విసభ్య కమిటీ సభ్యుడు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, అర్బన్ బ్యాంకు చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ పాల్గొన్నారు. దొమ్మేరులో ఇన్‌చార్జి తహసీల్దార్ ఆర్.అజయ్‌బాబు, తొగుమ్మిలో ఎంపీపీ డీకే సుశీల పర్యవేక్షించారు.

97 శాతం పింఛన్ల పంపిణీ

తాళ్లపూడి: మండలంలోని పలు గ్రామాల్లో పింఛన్ల పంపిణీని కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, మండల ప్రత్యేకాధికారి రాంబాబు, ఎంపీడీఓ వెంకటరమణ, ఇన్‌చార్జి తహసీల్దార్ పి.భారతి పరిశీలించారు. మొత్తం 7,917 పింఛన్లకు 97 శాతం పంపిణీ చేసినట్టు ఎంపీడీఓ తెలిపారు. మొత్తం రూ.3.34 కోట్లు విడుదలైనట్టు చెప్పారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పు హర్షణీయం


కొవ్వూరులో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు


పిట్టల వేమవరంలో కేక్ కట్ చేస్తున్న దళిత నాయకులు

కొవ్వూరు: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు సానుకూలంగా తీర్పు ఇవ్వడం మంద కృష్ణ మాదిగ పోరాట ఫలితమేనని ఎమ్మార్పీఎస్, ఎస్సీ సెల్ నాయకులు ప్రకటించారు. గురువారం స్థానిక స్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సంబరాలు చేసుకున్నారు. అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. నాయకులు పెనుమాక జయరాజు, వేమగిరి వెంకట్రావు, వరిగేటి కాంతరాజు తదితరులు పాల్గొన్నారు.

పెరవలి: సుప్రీంకోర్టు తీర్పు చారిత్రకమైందని నాయకులు సొంగరాజు అన్నారు. పిట్టల వేమవరంలో మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

దేవరపల్లి: ఎస్సీ వర్గీకరణ కోసం పోరాడిన అమరజీవులకు ఈ తీర్పు అంకితమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి కె.బుజ్జిబాబు మాదిగ ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా కృతజ్ఞత యాత్రలు చేస్తామన్నారు.

నల్లజర్ల: సుప్రీం తీర్పుపై చీపురుగూడెంలో మాదిగలు మర్లపూడి ఏసుదాసు ఆధ్వర్యంలో విజయోత్సవ కార్యక్రమం చేశారు. నల్లజర్లలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొబ్బిలి వెంకట్రాజు, జిల్లా అధ్యక్షుడు పత్తిపాటి రాంబాబు, మర్రి శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: ఎస్సీ వర్గీకరణ అంశంలో సుప్రీంకోర్టు తీర్పుపై ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దిద్దే మధుబాబు హర్షం వ్యక్తం చేశారు. పాలంగి గ్రామంలో డాక్టర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్, మంద కృష్ణ మాదిగ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. కాల్దారి గ్రామంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెట్టే సుజనరావు మాదిగ ఆధ్వర్యంలో విజయోత్సవం నిర్వహించారు.

నిడదవోలు: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పు సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద డాక్టర్ అంబేడ్కర్, జగ్జీవన్‌రాం చిత్రపటాలకు నివాళులర్పించారు.

ఏఎంసీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగ నేతలకు సత్కారం


సంఘ నాయకులను సత్కరిస్తున్న సిబ్బంది

కొవ్వూరు: ఏపీ వ్యవసాయ మార్కెట్ కమిటీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నక్కా వెంకటరత్నం, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులైన పాలిశెట్టి శివకు గురువారం స్థానిక ఏఎంసీ కార్యాలయంలో అభినందన సభ నిర్వహించారు. వారిని కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. రానున్న రోజుల్లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని వారు చెప్పారు. ఇప్పటికే పోరాటాలతో అనేక డిమాండ్లను సాధించుకున్నామన్నారు. చెక్ పోస్టుల ఆధునీకరణ, సిబ్బందికి సౌకర్యాలు, ఇతర సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఏఎంసీ కార్యదర్శి టి.శ్రీనివాసులు, సూపర్‌వైజర్ ఐ.వెంకటేశ్వరరావు, ఎస్.మాధురి, ఎం.చిట్టిబాబు, మోహన్, సుంకవల్లి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.